వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	02	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	14	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	01	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	11	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	13	448
పార్వతీపురం స్పెషల్	12	672
పార్వతీపురం సాధారణ	10	336

- వేములవాడ



నిద్రచ్చేదాకా ఆడేటోళ్లం



కాల్వశ్రీరాంపూర్: ఆ కాలంల బతుకమ్మ పండుగచ్చిందంటే ఊరంతా పండుగే. హుస్సేన్‌మియా వాగుల బతుకమ్మలుంచి నిద్రచ్చేదాకా ఆడేటోళ్లం. సద్దుల రోజు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పోటీ పడి పాడేటోళ్లం. అప్పుడు ఆటపాటలతో సంబరాలు. అప్పుడు కొత్త కోక(నేత చీర). ఇప్పుడు బట్టలు(పట్టుచీరలు), బంగారం, నగలు. గిప్పుడు సొమ్ములు చూసి సోపతి చేస్తున్నరు. - గాజుల లసమ్మక్క, ఆశన్నపల్లె

ఇంటిల్లిపాది సంబరం



సుల్తానాబాద్: బతుకమ్మ అంటేనే ఇంటిల్లిపాది సంబరంగా జరుపుకునే పండుగ. ప్రపంచ దేశాల్లో పూల పండుగ ఎక్కడా లేదు. వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులు ఇంటికొస్తారు. అందరం కలిసి బతుకమ్మ ఆడి పాడి కోలాట మాడడంతో వ్యాయామం చేసినట్లే అనిపిస్తుంది. - వీరగోని సుజాతగౌడ్, గర్రెపల్లి

అమ్మ దగ్గర నేర్చుకున్న



సుల్తానాబాద్: చిన్నతనంలోనే అమ్మ దగ్గర బతుకమ్మ ఆటపాటలు నేర్చుకున్న. బొడ్డెమ్మతో ప్రారంభమయ్యే బతుకమ్మను నవరాత్రులు ఆడుతాం. సద్దుల బతుకమ్మను అంగరంగ వైభవంగా జరుపుకుంటాం. ఆర్యవైశ్య మహిళలందరూ దాండియా ఆడుతారు. - పల్లా అపర్ణ, గాంధీనగర్, సుల్తానాబాద్



రామగిరి: నాగెపల్లిలో పూజలు నిర్వహిస్తున్న పోతురాజులు, శివసత్తులు, గ్రామస్తులు



యైటింక్లయిన్‌కాలనీ: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మునాలి

దుర్గామాతా.. నమోస్తుతే..

దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం చండీ, లలితాదేవి రూపంలో దర్శనమిచ్చారు. మండపాల వద్ద చండీ హోమం, అన్నదానం, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



కమాన్‌పూర్: ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కొలువుదీరిన అమ్మవారు



రామగుండం: అంబేద్కర్‌చౌక్ ఏ-కాలనీలో చండీ హోమం



ఫెర్టిలైజర్‌సిటీ: రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో లలితాదేవిగా అమ్మవారు



రామగిరి: సెంటనరీకాలనీ జోన్-1లో జైపూర్ ఏసీపీ ఆరె వెంకటేశ్వర్లు పూజలు



కాల్వశ్రీరాంపూర్ సీతారామాలయంలో చండీ హోమం



పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయంలో చండీ హోమం



సుల్తానాబాద్‌లోని పూసాల భక్త మార్కండేయ ఆలయంలో కుంకుమ పూజలు



ఎలిగేడులో మహా చండీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



జూలపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



జూలపల్లి: వన మహోత్సవంలో మొక్కల పెంపకం లక్ష్యం చేరాలన్న అధికారుల తపన ఇళ్ల యజమానులను ఇరకాటంలో పడేసింది. మండల కేంద్రంలో రోడ్ల వెంట వనమహోత్సవంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో రోడ్డుపై ఇళ్ల ముందు మొక్కలు నాటించిన అధికారులు.. వాటి రక్షణకు ప్లాస్టిక్ జాలీలకు బదులు ముళ్ల కంచెలు నాటించారు. దీంతో ఇంటి యజమానులకు, చిన్న పిల్లలకు ముళ్లు గుచ్చుకుంటున్నాయని వాపోతున్నారు. ముళ్ల కంచెలు తొలగించి ప్లాస్టిక్ జాలీలు పెట్టించాలని కోరుతున్నారు.

సమస్యపై సంప్రదించాల్సిన అధికారి: సదానందం, ఏపీవో, సెల్ నం.: 89788 43992

వాట్సాప్ చేయండి..

మా ఫోన్ నంబర్: 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

క్లుప్తంగా

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను కూల్చివేయాలి

ఓదెల: జీలకుంట గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 563బై2 అక్రమంగా నిర్మించిన ఇల్లు, గోడను వెంటనే కూల్చివేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు అంబేడ్కర్ సంఘం కాలనీవాసులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన ఆకునూరి రాజయ్య అనే వ్యక్తి 4 గుంటల స్థలాన్ని ఆక్రమించి జీపీ అనుమతి లేకుండా అదనంగా గదులు, గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌కౌంటర్ కాదు.. బీజేపీ హత్యలు..

సుల్తానాబాద్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నారాయణపూర్ దంతేవాడలో జరిగింది ఎన్‌కౌంటర్ కాదని, బీజేపీ హత్యలేనని సీపీయూఎస్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రమేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ పచ్చి బూటకమని, 40 మందిని పొట్టన పెట్టుకున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన దుర్మార్గమైన హత్యలేనని అన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



కరపత్రాలు అందిస్తున్న శంకర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఉదయ్‌నగర్‌లో సోమవారం హెచ్‌ఐవీ తదితర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్ అన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ లక్ష్మి, నవ్య, శైలజ, అభిరాం పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు



చెరువు కట్ట వద్ద పిచ్చి మొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న పెద్ద చెరువు చుట్టుపక్కల బతుకమ్మ నిమజ్జనం కోసం పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను కార్మికులు తొలగిస్తున్నారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శుభ్రం చేయించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జూలపల్లి: కాచాపూర్‌లో ఇటీవల అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతూ బత్తిని లింగయ్యగౌడ్ మృతిచెందగా.. కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పరామర్శించారు. 50 కిలోల బియ్యం అందజేశారు.

రామగిరి: రత్నాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లింగయ్య మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ శివగౌడ్‌ను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి పరామర్శించారు. సీనియర్ నాయకులు మచ్చగిరి రాము, కొండు లక్ష్మణ్, తోట్ల రాజు, శివ, పిడుగు రాజు, రేణిగుంట్ల విజయ్ పాల్గొన్నారు.

గిరిజన కమ్యూనిటీ హాల్ నిర్మించాలి



వినతిపత్రం అందిస్తున్న సాయిరామ్‌నాయక్

రామగుండం: నియోజకవర్గ పరిధిలో గిరిజన కమ్యూనిటీ హాల్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాయిరామ్ నాయక్ సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు.

ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలి



పెద్దంపేటలో బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: గ్రామాల్లో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని సోమవారం అంతర్గాం ఎంపీడీవో ఎంఏ అలీం పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పెద్దంపేట గ్రామంలో తాగునీటి బావిని పరిశీలించారు. దాని ప్రాంగణంలో ఉన్న పిచ్చిమొక్కలు, ఇతరత్రా వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయించారు. నర్సరీలను సందర్శించారు. ఎంపీవో వేణుగోపాల్, ఈజీఎస్ ఏపీవో రమేశ్ తదితరులున్నారు.

ముత్తారం: గ్రామాల్లో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఎంపీడీవో సురేశ్ అన్నారు. సోమవారం ముత్తారంలోని మురుగు కాలువలను పరిశీలించారు. చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులతో తీయించి ట్రాక్టర్‌లో తరలించారు.

బతుకమ్మ వేడుకలు



కాల్వశ్రీరాంపూర్‌లో బతుకమ్మతో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగులు సోమవారం బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. వివిధ పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను జరుపుకుంటున్న ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్, హెచ్‌ఎస్‌వో భాగ్య, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు పూర్తి చేయాలి



కొత్తపల్లిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో తదితరులు

పెద్దపల్లిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీధర్ అన్నారు. కొత్తపల్లిలో సోమవారం సద్దుల బతుకమ్మ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. మహిళలంతా ఒక్కచోట చేరి ఆడే సద్దుల బతుకమ్మ సందర్భంగా ఆ ప్రాంతాన్ని చదును చేసి సౌకర్యంగా ఉండేలా చూడాలన్నారు. ప్రధాన కూడళ్లు, బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో ఫయాజ్‌అలీ, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న కందుల సంధ్యారాణి, నాయకులు

గోదావరిఖని: బీజేపీ అధికారంలో ఉండటం వల్లే భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదిగిందని నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. సోమవారం బీజేపీ నాయకుడు పిడుగు కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన చౌరస్తాలో మెంబర్‌షిప్ డ్రైవ్ నిర్వహించారు. నాయకులు మేర్గు హన్మంతుగౌడ్, జిల్లా ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ, ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి జక్కుల నరహరి, జనగామ మండల అధ్యక్షుడు గుండెబోయిన భూమయ్య, గోపగాని నవీన్‌గౌడ్, కొమ్ము గట్టయ్య, కోడూరి రమేశ్, కొండపర్తి సంజీవ్, అందే రాజ్‌కుమార్, మామిడి వీరేశం, బుంగ మహేశ్, జక్కుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థినికి మెడిసిన్ సీటు



శ్రీహిత

ధర్మారం: నందిమేడారం గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లలింగయ్యపల్లి గ్రామానికి చెందిన సాన శ్రీహితకు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నీట్ ఫలితాల్లో మెడిసిన్ సీటు లభించింది. 5వ తరగతి నుంచి పదోతరగతి వరకు చింతకుంట ప్రభుత్వ గురుకుల విద్యాలయంలో చదివింది. పదోతరగతిలో 10 జీపీ సాధించి ఇంటర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిజామాబాద్ గురుకులంలో చేరి పూర్తి చేసింది. ఇంటర్‌లో 1,000 మార్కులకు గాను 977 సాధించింది. నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు లభించింది.



జయ్యారం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



పెద్దబొంకూర్‌లో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పాలకుర్తి: జయ్యారం గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. గురువులను సత్కరించి సహపంక్తి భోజనాలు చేశారు. ఎం.శ్రీనివాస్, రాజయ్య, కవిత, విక్టోరియారాణి, శిరీష పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్ శివారులో పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. యైటింక్లయిన్ కాలనీలోని కాకతీయ పాఠశాలకు చెందిన విద్యార్థులంతా ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్, కరస్పాండెంట్ యాదగిరి, ఉపాధ్యాయలను సత్కరించారు.

సింగరేణి వార్తలు

వకీల్‌పల్లి గని సందర్శన



మ్యాప్ పరిశీలిస్తున్న రాజీవ్‌ఓంప్రకాశ్‌వర్మ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 పరిధిలోని వకీల్‌పల్లి గనిని డీడీఎంఎస్ ఎలక్ట్రికల్ రాజీవ్‌ఓంప్రకాశ్‌వర్మ సోమవారం సందర్శించారు. ముందుగా ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో సర్వే మ్యాప్ ద్వారా పని ప్రదేశాలను పరిశీలించారు. బొగ్గు వెలికితీత పనులను కూడా తెలుసుకున్నారు. అధికారులతో కలిసి గనిలోనికి దిగి కంటిన్యూస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ పని స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రక్షణకు సంబంధించిన సూచనలు, సలహాలు తెలిపారు. ప్రాజెక్టు అధికారి నెహ్రూ, మేనేజర్ రవికిరణ్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు తదితరులున్నారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

గోదావరిఖని: సింగరేణి స్థాయి బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న పోటీల్లో సంస్థవ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ పోటీలను ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ ప్రారంభించనున్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుడి కుమారుడు, జాతీయ అవార్డు గ్రహీత, కాలనీకి చెందిన తాడూరి సంపత్‌కుమార్‌ను సోమవారం కాలనీలో పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టర్-3 సింగరేణి పాఠశాలలో 1992-93లో 10వతరగతి పూర్తి చేసిన సంపత్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేయడంతోపాటు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సంక్షిప్త వార్తలు

రేపు జిల్లాకు సీఎం కప్ టార్చ్ ర్యాలీ

పెద్దపల్లిరూరల్: సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ బుధవారం జిల్లాకు చేరుకుంటుందని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి సురేశ్ తెలిపారు. జిల్లాలోని నారాయణపూర్ క్రాస్‌రోడ్ నుంచి మొదలయ్యే ఈ ర్యాలీలో జిల్లాలోని క్రీడాకారులతోపాటు ఒలింపిక్స్ అధ్యక్ష, కార్యదర్శులు, ఆఫీస్ బేరర్స్, పీఈటీల సంఘ నాయకులు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, యువజన సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. నారాయణపూర్ క్రాస్‌రోడ్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్‌తోపాటు మండల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొంటారన్నారు.

నేత్ర దాత కుటుంబానికి అభినందన పత్రం

కోల్‌సిటీ: గోదావరిఖని ఎల్బీనగర్‌కు చెందిన ఎం.అఖిల్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సోమవారం నేత్ర దాత సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి మాట్లాడుతూ.. నేత్రాలను దానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు అభినందన పత్రాన్ని అందజేశారు. కేఎస్ వాసు, నూతి సురేశ్, అవినాశ్, బోళ్ల చంద్రశేఖర్, రఘుపతిగౌడ్, లూర్దురెడ్డి పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయండి

జ్యోతినగర్: ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకులు కోరారు. సోమవారం ఎన్టీపీసీలోని లేబర్ గేట్ ఎదుట పోస్టర్ ఆవిష్కరించారు. తోకల రమేశ్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, ఆడెపు శంకర్, తూళ్ళ శంకర్, ఇనుగాల రాజేశ్వర్, కల్వల రాయమల్లు తదితరులున్నారు.

కుల వృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యం

రామగుండం: కాంగ్రెస్ ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతోందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం పట్టణంలోని పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలి మత్స్యకారులనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఖదీర్, జిల్లా ఫిషరీష్ ఆఫీసర్ భాస్కర్, మత్స్యకార సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య తదితరులున్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావ వేడుకలు ఈనెల 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య తెలిపారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం కరపత్రాలను పౌరహక్కుల సంఘ నేత మాదన కుమారస్వామితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. మల్లేశం, మాదన కుమారస్వామి, వినోద్, బాలసాని రాజయ్య, మల్లన్న, రాజన్న, సుదర్శన్, బాపన్న, సదానందం, రవీందర్, లక్ష్మణ్, సుధాకర్, లింగయ్య తదితరులున్నారు.

రాజేశ్ జన్మదిన వేడుకలు

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేశ్ జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో నిర్వహించారు.

నేడు హుండీ లెక్కింపు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివరహస్వామి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించనున్నట్లు ఈవో కాంత రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు హాజరవ్వాలని సూచించారు.